తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం  సూర్యాపేట  యాద్రాద్రి భువనగిరి

గురువారం 25 జూన్ 2026 | పేజీలు : 8

Follow :




# నల్గొండను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి,జూన్ 24,(జనం సాక్షి):** నల్గొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.బుధవారం నల్గొండ ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న విస్తరణ, ఆధునికీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు సిటీ బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పట్టణ మహిళలు షాపింగ్ తదితర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కళాశాల విద్యార్థులు ఆస్పత్రికి చేరుకునేందుకు ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందని, ఇకపై సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.చెరువుగట్టు?ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధరవేశిపురం నుంచి దుప్పలపల్లి వరకు సిటీ బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నల్గొండకు అదనంగా 30 బస్సులను కేటాయించినట్లు వెల్లడించారు.మహిళా సంఘాల సాధికారత కోసం 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ బంక్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఆర్టీసీ బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త టికెట్ కౌంటర్లు, వెయిటింగ్ గార్డెన్, బాత్రూములు, టాయిలెట్లు, ఆధునిక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు.పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా కోసం రూ.83 కోట్ల వ్యయంతో వాటర్ ఫిల్టర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యతనిస్తూ నల్గొండను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తదితరులు పాల్గొన్నారు.





## ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు

**భూదాన్ పోచంపల్లి, జూన్ 24 (జనం సాక్షి):** మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి మూడో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. కే. శ్రీలత తెలిపారు. 2025-26లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 27, 29, 30 తేదీల్లో ఉదయం 6 గంటలలోపు కళాశాలకు చేరుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చున్నారు. ఎంపికలో ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అభ్యర్థులు ట్రాక్ ప్యాంట్, టీ-షర్ట్, షూస్ ధరించి అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## తాజ్ పూర్ లో ప్రాథమికోన్నత పాఠశాల పునః ప్రారంభం

### ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈవో, గ్రంథాలయ చైర్మన్

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 24 (జనం సాక్షి):** భువనగిరి మండలంలోని తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పునః ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా విద్యా ధికారి బిక్షపతి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ హాజరై తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలను సొంత ఖర్చు లతో అభివృద్ధి చేయడం సర్పంచ్ సంతోష్ శ్రీనివాస్ కు అభినందించారు. ఇలాంటి పాఠశాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకొని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంతోషా శ్రీనివాస్ మాట్లాడుతూ దాదాపు 16 లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాల కు దీటుగా కంప్యూటర్ ల్యాబ్, ఎల్ ఈ డి డిజిటల్ క్లాస్ స్క్రీన్ లు, వైఫై, సిసి కెమెరాలు, అదునాతన టాయిలెట్లు, అర్ ఒ ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్లు, మొక్కలు నాటించడం, అందమైన గ్రీనరీ ఏర్పాటు, క్రీడా సామాగ్రి, తరగతి గదులలో విద్యా విజ్ఞాన చిత్రపటాలు, సమావేశ వేదిక ఏర్పాటు,నూతన నాణ్యమైన ఫర్నిచర్, విశాలమైన వంటగది రూపకల్పన, ఆటో సౌకర్యం, అదనపు వాలంటీర్ ను నియమించడం అత్యున్నత ప్రమాణా లతో పునరుద్ధరించి విద్యార్థుల సంఖ్య ఎంతో గణనీయం గా పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రంగరాజన్, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఏ ఏ పి సి చైర్మన్ మరియు వైస్ చైర్మన్, గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు,యువజన సంఘాల నాయకులు, మహిళలు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించాలి

### ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

**చౌటుప్పల్ జూన్ 24(జనం సాక్షి)**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు.నారాయణపురం,మండల పరిధిలోని పుట్టపాక గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘మన ఫార్మసీని,గట్టుప్పల్ మండల కేంద్రంలో మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర కిరాణా అండ్ జనరల్ స్టోర్స్ ను ఇ.ఎల్.వి. భాస్కర్ రిబ్బన్ కట్ చేసి బుధవారం ప్రారంభించారు.ఇరువురికి ప్రారంభోత్సవ కానుకగా రూ. 20,000 వేల రూపాయల చొప్పున అందజేశారు.ఈ సందర్భంగా ఇ.ఎల్.వి. భాస్కర్ మాట్లాడుతూ...స్థానిక యువత ఉపాధి మార్గాలను ఎంచుకుంటే తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన పేర్కొన్నారు.


## గిరిజనులు, ఎరుకలు, యానాదులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తి

### గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ, జూన్ 24(జనంసాక్షి)**

గిరిజనులు, ఎరుకలు, యానాదులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న బస్సు యాత్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గిరిజన ఎమ్మెల్యేల బృందం కలిసి ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, గిరిజనులు, ఎరుకలు, యానాదుల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా వేలాది మంది గిరిజన యువతకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు లభించాయని తెలిపారు.రిజర్వేషన్లు అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర ద్వారా గిరిజన సమాజ చరిత్ర, వారి హక్కులు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు.గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, భవిష్యత్తులో కూడా గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని గిరిజన ప్రజలకు పిలుపునిచ్చారు.



# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

○1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి సామాజిక న్యాయం చేయాలి

○కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు డిమాండ్





**భువనగిరి, జూన్ 24 (జనంసాక్షి)**

దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే రాజ్యాంగపరమైన హక్కులు, ఎస్సీ హోదా రద్దవుతుందని సుప్రీంకోర్టు 33 పేజీల తీర్పు కోట్లాదిమంది దళితుల గుండెపై దాడి చేసిందిని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15,16 ,25లను హత్య చేసిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు విమర్శించారు. బౌద్ధం, సిక్కు మతాలలోకి వెళితే రాజ్యాంగ హక్కులు యధావిధిగా ఉన్నప్పుడు కేవలం క్రైస్తవంలోకి వెళితే మాత్రమే రాజ్యాంగ హక్కులు, చట్టాలు రిజర్వేషన్లు ఎందుకు లేకుండా పోతాయని ఈ తీర్పుపై కేంద్రం సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ కు వెళ్లి రాజ్యాంగ హక్కులు దళిత క్రైస్తవులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

బుధవారం భువనగిరిలోని తిరందాసు గోపి మీటింగ్ హాల్లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో " దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని " కోరుతూ " జిల్లా సదస్సు " కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం అధ్యక్షతన జరిగింది. ఈ జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి కాకుండా మత విశ్వాసాల ఆధారంగా ఈ తీర్పు వెలువడిందని అన్నారు. ఈ తీర్పు సామాజిక న్యాయం, రాజ్యాంగ లక్ష్యాల మీద కూడా దాడి చేసిందన్నారు. కులం పుట్టుకతో వస్తుందని తనకు నచ్చిన మతాన్ని స్వీకరించటం విశ్వాసాలు, నమ్మకాల ఆధారంగా వస్తుందన్నారు. మతం ఆధ్యాత్మిక విశ్వాసమని, కులం సామాజిక వంశపారంపర్యంగా కొనసాగుతున్న ఒక అవిభాజ్యమైన ప్రక్రియ అని తెలిపారు. క్రైస్తవంలోకి వెళ్లినవారిలో దళితులు మాత్రమే కులవివక్ష, అంటరాని తనానికి ఎందుకు గురవుతున్నారో చెప్పాలన్నారు. దళిత పాస్టర్లే ఎందుకు దౌర్జన్యాలకు దాడులకు, హత్యలకు గురవుతున్నారని ప్రశ్నించారు. క్రైస్తవం పుచ్చుకున్నంత మాత్రాన కులవివక్ష, అంటరానితనం పోవట్లేదనే రుజువులు అనేక ఉన్నాయని అన్నారు.

ఒకవేళ అదే అయితే 1985లో కారంచేడులో దళితులను హత్య చేసిన సంగతి ఏమిటి? వారందరూ దళితులు క్రైస్తవులు కూడా అయినప్పటికీ మతం పేరుతో దాడి జరగలేదని కేవలం కులం పేరుతోనే దాడి హత్యలు జరిగాయని గుర్తు చేశారు. 1991లో చుండూరులో హత్యకు గురైన వారందరూ దళితులేనని, వారు క్రిస్టియన్ విశ్వాసాలతో ఉన్నారు. అయినా దారుణ హత్యజరిగిందన్నారు. మత విశ్వాసాల ఆధారంగా కాకుండా తాను పుట్టిన కులం ఆధారంగా వివక్షను, దాడులను, అత్యాచారాలను, హత్యలను ఎదుర్కొంటున్న పరిస్థితి నేటికీ కొనసాగుతుందన్నారు.

అగ్రకులాల్లో పుట్టి క్రైస్తవాన్ని పుచ్చుకున్న వారు తమ సామాజిక హోదాగా ఉన్నత కులం ఆధారంగానే గౌరవించబడుతున్నారని మతం మారినప్పటికీ చర్చిలు కూడా కులాల వారిగా ఉంటున్నాయని చర్చిలలో కూడా స్వకుల వివాహాలు జరుగుతున్నాయని చెప్పారు. దళితులు 15శాతం రిజర్వేషన్ పొందుతున్న వారు దళితులు క్రైస్తవం పుచ్చుకుంటే ఒక శాతానికి వారి రిజర్వేషన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతంలో గుడిలోకి రానీయకపోయినా, బడిలో చదువుకోనీయకపోయినా విద్య పరంగా, వైద్య పరంగా క్రిస్టియన్ మిషనరీ స్కూల్స్, మిషనరీస్ హాస్పిటల్స్, చర్చిలు సంపూర్ణంగా దళితుల్ని చేరదీశాయని తెలిపారు. ఎల్లయ్య అనే పేరిట దళితుడు హిందూ సమాజంలో ఉంటే ఎల్లిగాడు అని అవమానిస్తున్న స్థానంలో చర్చికి వెళితే ఏలియా అని పిలువబడుతున్నాడని గుర్తు చేశారు. మతం మారినంత మాత్రాన తమ బ్రతుకులు మారడం లేదని, వారు ఎదుర్కొనేటువున్న కులవివక్ష పోవడం లేదన్నారు. బీసీలు 27% రిజర్వేషన్ ఓసీలు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పొందుతున్నారు క్రిస్టియన్ మతాన్ని స్వీకరిస్తే ఆ రిజర్వేషన్ నుండి వాళ్ళు దూరం కావట్లేదన్నారు. కానీ దళితులు మాత్రమే క్రైస్తవంలోకి వెళితే ఆ రిజర్వేషన్ వాళ్ళు కోల్పోవాల్సి రావడం ఏమిటని ప్రశ్నించారు.

ఇక్కడ గుడిలోకి రానివ్వరు అక్కడ చర్చిలోకి పోనివ్వరు దళితుల బ్రతుకులకు భరోసా ఎలా అన్నారు. బ్రదర్ అనిల్ కుమార్, బ్రదర్ సతీష్ కుమార్ లు లక్షలాది మందితో సభలు నిర్వహిస్తున్నారు వారిపై ఏ రకమైన దాడులు, దౌర్జన్యాలు జరగలేదు. కేవలం గ్రామ సీమల్లో దళిత పాస్టర్లుగా ఉన్న వారి పైన మాత్రం దాడులు, దౌర్జన్యాలు, హత్యలు కొనసాగుతున్నాయని అంటే కులం కారణం కాదా అని అన్నారు. కేంద్ర బిజెపి సర్కార్ 12 ఏళ్ల పరిపాలన కాలంలోనే దళితులపై దాడులు, దౌర్జన్యాలు 300 రెట్లు పెరిగాయన్నారు కేంద్ర ప్రభుత్వ అడ్డదండలతోనే ఈ దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటం చేయకుండా దళితుల హక్కులు రక్షించుకోలేమని చెప్పారు. 2018 లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చడానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశంలో ప్రతీ పౌరుడు ఐక్యంగా ఉద్యమించిన ఫలితంగా ఆ తీర్పు వెనక్కి తీసుకోబడిందన్నారు. అదే స్ఫూర్తితో 2026 మార్చి 24న వచ్చిన తీర్పును వెనక్కి తీసుకునేవరకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో

1) మార్చి 24న వెలువడించిన సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర ప్రభుత్వమే రాజ్యాంగ స్ఫూర్తితో సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ కి వెళ్ళాలని

2) రాజ్యాంగ విరుద్ధంగా 1950 లో తెచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను రద్దు చేయాలని

3)కెజి బాలకృష్ణన్ కమిషన్ నివేదికను బహిర్గతపరచాలని

4) దళిత క్రైస్తవుల పైన జరుగుతున్న దాడులను, దౌర్జన్యాలను అరికట్టాలనీ

5)దళిత క్రైస్తవులు రాజ్యాంగాన్ని బైబిల్ రెండు చేతుల్లో పట్టుకొని రాజకీయ చైతన్యం ద్వారా చర్చిలో ప్రార్థన, రోడ్ పై శాంతియుత ప్రదర్శన నిర్వహించాలని తీర్మానాలు చేశారు.

ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ, దళిత సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య, పిఎంసి రాష్ట్ర కార్యదర్శి సురుపంగ శివలింగం, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్ర సుదర్శన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు గ్యార అశోక్, అబ్దుల్లాపురం వెంకటేష్, వడ్డేపల్లి యాదగిరి, పాపగళ్ళ లింగస్వామి, పాస్టర్లు కే దినాకర్, కొండపురం పాల్, క్రిస్టోఫర్, బి. ప్రేమ్ కుమార్, ప్రకాష్, జాన్, పీటర్ బాబు, యాదగిరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 28 న నిర్వహించే పల్స్ పోలియోని సద్వినియోగం చేసుకోవాలి డాక్టర్ చంద్రశేఖర్



**పెన్ పహాడ్, జూన్ 24 (జనం సాక్షి) :** మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని జిల్లా ఉప ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గాజుల చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 28వ తేదీ ఆదివారం జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ నూటికి నూరు శాతం పల్స్ పోలియో చుక్కలు అందే విధంగా చూడాలని సిబ్బందికి సూచన చేశారు. పల్స్ పోలియో నిర్వహణలో ఎలాంటి అజాగ్రత్త వహించరాదని, క్షేత్రస్థాయిలో మైక్రో యాక్షన్ ప్లాన్ ప్రకారం పనిచేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కోరారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక కార్యక్రమాల నిర్వహణ, అసంక్రమిత వ్యాధుల (నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్) నివారణ కార్యక్రమానికి సంబంధించిన స్క్రీనింగ్ వివరాలు, ఆన్‌లైన్ ఫాలో-అప్ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను నిరంతరం అప్‌డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్లు జయశ్రీ, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఇందిర, నాగలక్ష్మి, నాగమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా అధికారులు పనిచేయాలి

### జిల్లా ప్రత్యేక అధికారి డా. గౌరవ్ ఉప్పల్



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 24,(జనంసాక్షి):** ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అన్నది తెలుసుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. నల్గొండ జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను డా. గౌరవ్ ఉప్పల్ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ లబ్ధిదారులను కేంద్ర బిందువుగా తీసుకుని పథకాల అమలుకు కృషి చేయాలని సూచించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య రక్షణకు దోమతెరలు, దోర్లు తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను చిన్నచిన్న అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లాలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల పనితీరును వివరించారు.సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, డీఎఫ్‌వో రాజశేఖర్, సీపీఓ శ్రీనివాస్ నాయక్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిక

**నేరేడుచర్ల( జనంసాక్షి):**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్, మండల బీజేపీ కోశాధికారి కొప్పుల రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ కొణతం.వెంకట్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రామ్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మార్కెట్ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు లచ్చయ్య, జ్యోతిబాబు, మాజీ సింగిల్ విండో చైర్మన్ అనంత శ్రీను, మాజీ కౌన్సిలర్ నాగయ్య, నంద్యాల సోమిరెడ్డి, రాంరెడ్డి, గోపి, మధుకర్ రెడ్డి, మచ్చ శ్రీను, కత్తి శ్రీనివాస్ రెడ్డి, భార్గవ్, సైదులు, పెరుగు నాగరాజు, మురళీధర్ రెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా ట్రస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**దేవరకొండ, జూన్ 24(జనం సాక్షి )**
అయ్యప్ప సేవా ట్రస్ట్ దేవరకొండ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మరియు పదవి స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ట్రస్ట్ నూతన అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, కార్యదర్శి చిలువేరు శ్రీనివాస్ , కోశాధికారి తాడూరు సత్యం తదితర కార్యవర్గ సభ్యులు తమ పదవులకు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.కార్యక్రమానికి తల్లోజు ఆచారి, కొప్పు భాష,మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ అయ్యప్ప దేవాలయ గౌరవ అధ్యక్షుడు చిలువేరు చంద్రమౌళి ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, భక్తులకు సేవలు అందించాలని సూచించారు.నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ "సర్" మీద పోలింగ్ బూతు లెవెల్ ఏజెంట్లకి ,బూతు లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం

**పి.ఏ.పల్లి,జూన్ 24(జనంసాక్షి ):**




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ మీద పోలింగ్ బూతు లెవల్ ఏజెంట్లకు మరియు బూతు లెవల్ అధికారులకు పి.ఏ.పల్లి తహసిల్దార్ జయశ్రీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం మరియు అవగాహన సదస్సు బుధవారం నాడు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మండల అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి,మాజీ అధ్యక్షులు వీరబోయిన యల్లయ్య,బిఆర్ఎస్ పార్టీకి సంబంధించి మేకల ఏడుకొండలు,మూడవత్ జవహర్ లాల్,సిపిఐ పార్టీ నుండి మూడవత్ చందు నాయక్,సీపీఎం పార్టీ నుండి కావలి కృష్ణయ్య,బీజేపీ పార్టీ నుండి జిల్లా అధికార ప్రతినిధి పోతేం కరుణాకర్,చేపూరి నర్సింహ పాల్గొన్నారు.అన్ని గ్రామాల నుండి బూతు లెవల్ ఏజెంట్స్ మరియు బూతు లెవల్ అధికారులు హాజరయ్యారు.శిక్షణ కార్యక్రమం ఇచ్చిన వారిలో ఏఎల్ఎంటి వెంకటేశ్వర్లు,నాయబ్ తహసిల్దార్ రవిశంకర్,తదితరులు పాల్గొన్నారు.





# జాతీయ రహదారిపై భారీ గుంత వాహనదారుల ఆందోళన

## ఇచ్చట ప్రయాణం -ప్రాణాలతో చెలగాటం

కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై దేవరకొండ పట్టణంలోని పాత పెట్రోల్ బంక్, ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై మిషన్ భగీరథ పైప్ లైన్ కు సంబంధించిన గేట్ వాల్ కోరకు భారీ గుంత నిర్మించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గుంత వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండగా, తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..ప్రత్యేకించి రాత్రి వేళల్లో గుంత వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో గుంత కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ప్రజల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతపై పై కప్పు ఏర్పాటు చేయాలనీ వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

జనంసాక్షి , దేవరకొండ

## ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి

### మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి

**కొండమల్లేపల్లి, జూన్ 24 (జనంసాక్షి):**
గాయత్రీ మాత జయంతి సందర్భంగా కొండమల్లేపల్లి మండల గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఐదు కుండముల గాయత్రీ మహా యజ్ఞాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరు చంద్రమౌళి మాట్లాడుతూ ఈరోజు చాలా పవిత్రమైన రోజు అని గాయత్రి మాత జయంతితో పాటు దివి నుండి భువికి గంగామాత వచ్చిన రోజని అన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి దంపతులను, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డిని వేదమంత్రాలతో ఆశీర్వదించి ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎంపిపి మాట్లాడుతూ గాయత్రీ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాచేపల్లి వెంకటేశ్వర్లు, నూతన గంటి జగన్, మారం వెంకటేశ్వర్లు, గాజుల కుషాల్, ఎరుకొండ రాము, నేలపట్ల వాసు, నడ్డి.శంకర్, లచ్చిరామ్ నాయక్, వరలక్ష్మి, విజయలక్ష్మి, గాజుల వాణి, అజిత తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సహాయం అందజేత

**సూర్యాపేట (జనంసాక్షి):**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ వల్లభదాస్ సైదులు గౌడ్ కుటుంబ సభ్యులను బుధవారం గౌడ ఉద్యోగ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో పరామర్శించి 50 వేల రూపాయల చెక్ ను వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ రామ్మూర్తి గౌడ్ , ప్రధాన కార్యదర్శి చిత్తలూరి యాదగిరి గౌడ్ గారు,కోశాధికారి గుణగంటి వెంకటేశ్వర్లు గౌడ్, యూనిఫామ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లభదాస్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తండ అంజయ్య గౌడ్, అల్లాడి సత్యనారాయణ గౌడ్, జలగం పురుషోత్తం గౌడ్, జిల్లా కార్యదర్శి చీకూరి అనిల్ గౌడ్, మామిడి వేణు, సిద్దార్థ గౌడ్ సూర్యాపేట డివిజన్ అధ్యక్షులు లింగాల రవి గౌడ్, తుంగతుర్తి డివిజన్ లింగాల శ్రీనివాస్ గౌడ్, సూర్యాపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి సురభి శ్రీధర్ గౌడ్,సూర్యాపేట డివిజన్ గౌరవ అధ్యక్షులు చవగాని వెంకయ్య గౌడ్, రాచకొండ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**చందంపేట జూన్ 24(జనం సాక్షి)**



చందంపేట మండలం తెల్దేవరపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.అనంతరం గ్రామస్తులు మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య,కేతావత్ శంకర్ నాయక్, ఉప సర్పంచ్ గణేష్, తరి గోవర్ధన్, వడత్య బాలు , పల్లా లోహిత్ రెడ్డి, జగన్ చారి,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు

**భూదాన్ పోచంపల్లి, జూన్ 24 (జనం సాక్షి):**




మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి మూడో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా. కే. శ్రీలత తెలిపారు. 2025-26లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 27, 29, 30 తేదీల్లో ఉదయం 6 గంటలలోపు కళాశాలకు చేరుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చున్నారు. ఎంపికలో ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, వ్రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అభ్యర్థులు ట్రాక్ ప్యాంట్, టీ-షర్ట్, షూస్ ధరించి అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

# సర్ ప్రక్రియ విజయవంతానికి బిఎల్ఏ లు ఐక్యంగా కృషి చేయాలి

## తహసీల్దారు కోట రవికుమార్



**భద్రాచలం జూన్ 24 (జనంసాక్షి)**
ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియలో భాగంగా నేటి నుంచి ప్రారంభమయ్యే రెండో విడత కార్యక్రమంను విజయవంతం చేసేందుకు బిఎల్ఎలు ఐక్యంగా కృషి చేయాలని భద్రాచలం తహసీల్దారు కోటా రవికుమార్ అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమన్వయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ మొత్తానికి బూత్ లెవెల్ అధికారులు, బూతు లెవెల్ ఏజెంట్లు రెండు కళ్ళు వంటి వారని, ప్రతి ఇంటికి బిఎల్వోలు ఎలిమినేషన్ ఫారాలు అందిస్తారని ప్రతి ఓటర్కి ఫారాలు అందే విధంగా బి ఎల్ ఏ లు దృష్టి సారించాలని కోరారు. ఈ ప్రక్రియ జులై 24 వరకు కొనసాగుతుందన్నారు. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆగస్టు 30 వరకు స్వీకరించబడతాయన్నారు. సెప్టెంబర్ ఒకటో తారీఖున తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని వివరించారు. 90 రోజులపాటు జరగనున్న సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన బూతులు ఏజెంట్లు ప్రభుత్వం ప్రకటించిన బూతు లెవల్ అధికారులే అత్యంత కీలకంగా పని చేయాల్సి ఉంటుందని తాసిల్దార్ కోరారు. ఈ సమన్వయ సమావేశంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు బూతు లెవల్ అధికారులు పాల్గొని వారికున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి ఎలక్షన్ గోపాలకృష్ణ సీనియర్ నాయకులు రామయ్య బి ఎల్ ఓ సూపర్వైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడు శంకర్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

**బూర్గంపహాడ్ జూన్ 24 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సపావట్ శంకర్ ఇటీవల వ్యవసాయ పనులకు వెళ్లి గుండెపోటుతో మృతిచెందగా బుధవారం తినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆయన నివాసానికి వెళ్లి శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. శంకర్ ఉపాధ్యాయుడిగానే కాకుండా మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయన మరణం ఉపాధ్యాయలోకానికి, గ్రామానికి తీరనిలోటన్నారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ సొసైటీ అధ్యక్షులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బానోతు నరసింహ, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, కైపు లక్ష్మినారాయణరెడ్డి, భజన ప్రసాద్, సతీష్, ఇంగువ రమేష్, భూక్యా సేవాలాల్, దిలీప్, సుశాంత్రెడ్డి, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.



## ముత్తగూడెం రైతు వేదికలో

# విత్తన మేళా

### ఆధునిక సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన

**ఖమ్మం రూరల్, జూన్ 24 (జనంసాక్షి)**
ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా రైతులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం కూసుమంచి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) సతీష్ సందర్శించి రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయంలో సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "కేతి బచావో అభియాన్" కార్యక్రమం లక్ష్యాలను వివరిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ద్వారా సుస్థిర వ్యవసాయాభివృద్ధికి రైతులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ఉమా నాగేశ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే పీఎం-కుసుమ్ పథకం ద్వారా సౌరశక్తి వినియోగాన్ని పెంచుకుని సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు.

నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియోగం వల్ల ఎరువుల వినియోగం తగ్గడంతో పాటు పంటల ఎదుగుదల, దిగుబడులు మెరుగుపడతాయని రైతులకు వివరించారు. విత్తన మేళాలో పాల్గొన్న రైతులు పలు వ్యవసాయ అంశాలపై అధికారులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయురాలు కమలమ్మ

## సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు



**ఖమ్మం రూరల్, జూన్ 24(జనంసాక్షి):**
మండలంలోని కస్నాతండా గ్రామానికి చెందిన సీపీఎం నాయకురాలు భూక్య కమలమ్మ ఆదర్శప్రాయురాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. కమలమ్మ దశదినకర్మ సందర్భంగా కస్నాతండాలో బుధవారం కమలమ్మ చిత్రపటానికి బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ,సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు,జూలకంటి రంగారెడ్డి,జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు,వ్యకాస అఖిల భారత ప్రధాన కార్యదర్శి బీ.వెంకట్ లు బుధవారం కమలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమలమ్మ తన ఇద్దరు కుమారులను వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం,పాలేరు డివిజన్ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు లను ప్రజా ఉద్యమాలకు అందించి ఎందరో మహిళలకు ఆదర్శం అన్నారు. కమలమ్మ భర్త సామ్య నాయక్ ను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్,బుగ్గవీటి సరళ,కల్యాణం వెంకటేశ్వరరావు,వై.విక్రమ్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు,బొంతు రాంబాబు,బండి పద్మ,మెరుగు సత్యనారాయణ,వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్,గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్,పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నండ్ర ప్రసాద్,ఉరడీ సుదర్శన్ రెడ్డి,ఎస్కే.బషీరుద్దీన్, తుమ్మా విష్ణు వర్ధన్, దొంగల తిరుపతిరావు,గుడవర్తి నాగేశ్వం౯రావు, కొమ్ము శ్రీను,నందిపాటి మనోహర్, రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు సిద్దినేని కోటయ్య,ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పెరుమళ్ళపల్లి మోహన్ రావు, పొన్నం వెంకటరమణ,కారుమంచి గురవయ్య, ఏటుకూరి ప్రసాదరావు,చావా నాగేశ్వరరావు, జక్కంపూడి నాగేశ్వరరావు,ఏపూరి వర కుమార్, పొన్నం భాస్కరరావు,అద్దంకి తిరుమలయ్య, పుచ్చకాయల నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ,పాపిట్ల సత్యనారాయణ, కాచిరాజుగూడ సర్పంచ్ బానోత్ హరి,కస్నా తండా ఉపసర్పంచ్ అవిరేణి నాగరాజు,పొన్నం మురళీకృష్ణ,చాంద్ పాషా,సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్,రామ్మూర్తి నాయక్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం తదితరులు ఉన్నారు.

## విద్యుత్తు శాఖ డీఈ కార్యాలయం ఎదుట నిరసన

### ఏహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణ నిరసిస్తూ ఆందోళన




**భద్రాచలం జూన్ 24 (జనంసాక్షి)**
టీజీపీఈజేఏసీ కొత్తగూడెం బ్రాంచి ఆద్వర్యంలోని వైటీపీఎస్లో గల ఎహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణను నిరసిస్తూ భద్రాచలంలో బుధవారం విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఉద్యోగులందరూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ వైటీపీఎస్లో గల ఎహెచ్‌పీ, సీహెచ్‌పీ విభాగాల ప్రయివేటీకరణ వలన ఉద్యోగుల భద్రత, సేవా ప్రమాణాలు,సంస్థ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో ప్రైవేటీకరణ చర్యలు ఉద్యోగులలో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. జెన్కోను రక్షిస్తూ, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడతామని వారు స్పష్టం చేశారు. సేవ్ వైటీపీఎస్, సేవ్ టీజీ జెన్కో అనే నినాదాలతో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ జీవన్ కుమార్, ఏడిఈలు నరసింహారావు, వేణు, ఏఈలు రాజారావు ,ఉపేందర్,,రోహిణి, జ్యోతి, సబ్ ఇంజనీర్లు, భద్రాచలం ఈఆర్వో స్టాప్, భద్రాచలం డివిజన్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు వెంకటరాజు, రామకృష్ణ, ఉదయ్, పెద్దరాజు, త్రినాధ్ రెడ్డి,అన్నీ సెక్షన్ల ఏఈలు, సబ్ ఇంజనీర్స్, వర్క్ ఇన్స్పెక్టర్లు, సీనియర్ లైన్మెన్లు, లైనింగ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఐటీసీ కార్మికులకు డ్రగ్స్ పై అవగాహన..

**బూర్గంపహాడ్ జూన్ 24 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బుర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో డ్రగ్స్ పై స్థానిక ఎస్సై మేడా ప్రసాద్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడుతూ యువత, కార్మికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉంటే కుటుంబాలు బాగుంటాయన్నారు. మత్తు పదార్థాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, అంతేకాకుండా యువకులపై కేసులు నమోదైతే జీవితాంతం జైలు పాలు కావాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి నడవడికతో ముందుకు సాగా లని పలు సూచనలు చేశారు. గంజాయి సేవించినా, విక్రయించినా అలాంటి వారి సమాచారం పోలీసుస్టేషన్కు లేదా 100కు డయల్ చేసి తెలియచేయాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై నాగభిక్షం, ఎస్సై రామ్మూర్తి, పోలీసు



సిబ్బంది, ఐటీసీ కార్మికులు పాల్గొన్నారు.



## సంతోషిమాత దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవ వేడుకలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలో శ్రీసంతోషిమాత దేవాలయం ప్రతిష్ఠించి 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం దేవాలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ, పరిమి శివరామ జగన్నాథ శర్మ, అశోక్ మిత్రాలు సంతోషిమాత, సత్య సాంబశివుడు, లక్ష్మీ గణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత, మానస దేవి మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అలంకరణలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలతో సామూహికంగా కుంకుమార్చన, పుష్పార్చన, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజలు నిర్వహించారు. అనంతరం రుద్ర, లలిత, గణపతి హోమాన్ని నిర్వహించి మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంతోషిమాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త, అధ్యక్షులు బ్రహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి కొత్త మల్లికార్జున్, ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, మహంకాళి ఉపేందర్, నూక ముత్యాలమ్మ, బ్రహ్మండ్లపల్లి నాగమణి, మహంకాళి కవిత, బచ్చు నీరజ, ఓరుగంటి కనకరత్నం, వందనపు వెంకటేశ్వర్లు , లక్ష్మారెడ్డి, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట-అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో - విద్యార్థుల నిరసన**

**రామన్నపేట, జూన్ 24 (జనంసాక్షి):**
రామన్నపేట?అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సును తక్షణమే పునరుద్ధరించి విద్యార్థుల రవాణా సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించి విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రామన్నపేట మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా రామన్నపేట? అమ్మనబోలు రూట్లో ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ రూట్ పరిధిలోని 9 గ్రామాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు వివిధ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నప్పటికీ, మండల కేంద్రానికి కనీస రవాణా సౌకర్యం లేక విద్యాభ్యాసానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ, ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. ప్రతిరోజూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి రావడంతో ఒక్కో విద్యార్థి రోజుకు సుమారు రూ.100 వరకు ఖర్చు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం (డీఎం ఆఫీస్) ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు పెద్ది అక్షిత, మండల నాయకులు పిట్టల నవీన్, అప్పం అభిరూప్, యశ్వంత్, ముక్కిడి ప్రవీణ్, తుర్కపల్లి లోకేష్, అభినవ్, శ్రావ్య, అనుప్రియ, హారిక తదితరులు పాల్గొన్నారు.



## ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో విశేష సేవలందించిన బెజవాడ శేఖర్ కు ఘన సత్కారం

దేవరకొండ, జూన్ 24(జనం సాక్షి )
దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ..ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటలో పాల్గొన్న దేవరకొండ బిజెపి సీనియర్ నాయకుడు బెజవాడ శేఖర్ ను జిల్లా ఇన్చార్జ్ ఉదయ్ ప్రతాప్ బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బిజెపి సీనియర్ నాయకుడు బెజవాడ శేఖర్ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడారని, వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో విశేష సేవలందించిన నాయకులను ఈ సందర్భంగా సత్కరించారు.




## బెస్ట్ సేవా సొసైటి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

రామన్నపేట, జూన్ 24 (జనంసాక్షి):
రామన్నపేట మండలంలోని కక్కిరేణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు, ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులందరికీ బెస్ట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజన్ బాబు మాట్లాడుతూ కార్పోరేట్ స్కూళ్లకు దీటుగా గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగి, విద్యార్థులు మంచి నైపుణ్యం సాధిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం కల్పిస్తే మంచి మార్కులతో జిల్లా, స్టేట్ ర్యాంక్ లు వచ్చే అవకాశం ఉన్నదని, అందుకోసమే దాతలు ముందుకొచ్చి తగు సహాయ సహకారాలు, విద్య కు సంబంధించిన సామాగ్రి అదించి ఆదుకొనిన చో ఊరుకు, స్కూల్ కు మంచి పేరుప్రతిష్టలు వస్తాయని తెలిపారు. బెస్ట్ సేవా సొసైటీ ఉపాధ్యక్షులు మిర్యాల రామకృష్ణ సహకారంతో విద్యార్థులకు ప్రోత్సాహకంగా అభినందన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి ఉపేందర్ జి ఆర్గనైజర్ వేముల సైదులు ఉపాధ్యాయులు భద్రయ్య , శ్రీనివాసరావు , శేఖర్ రెడ్డి, రమేష్ , జ్యోతి , విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.






## సొంత పొలంలో విత్తనాలు చల్లిన మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు

కోదాడ టౌన్ జూన్ 24 ( జనంసాక్షి );
కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు తన సొంత వ్యవసాయ క్షేత్రంలో విత్తనాలు చల్లి సాగు పనులకు శ్రీకారం చుట్టారు. రైతులతో కలిసి పొలంలోకి దిగి విత్తనాలు చల్లుతూ వ్యవసాయం పట్ల తన అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. స్థానిక రైతులు, భూక్య సక్రు, టి.వెంకటరెడ్డి, పి.వెంకట్ రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పి.ఏ.పల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ఉద్యోగ విరమణ మహోత్సవంలో టీఎస్ యుటిఎఫ్



**పి.ఏ.పల్లి, జూన్ 24(జనంసాక్షి)**
పి.ఏ.పల్లి మండల విద్యాధికారి గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన అయిలబోయిన వెంకటయ్య దంపతులకు టిఎస్ యూటీఫ్ మండల శాఖ తరపున వారిని పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల పెన్షన్ బకాయిలు త్వరగతిన చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాస్ చారి, జిల్లా కార్యదర్శి చిన్న వెంకన్న, పగిళ్ల సైదులు మరియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి.జీవన్ కుమార్, వి.సతీష్ వెంకటయ్య, బి.జైపాల్ మరియు పోతెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న పింగల్ రెడ్డి, శ్యామ్ గౌడ్

**బీబీనగర్ (జనంసాక్షి):**
బీబీనగర్ మండలం మక్తాఅనంతారం గ్రామంలో ఉపసర్పంచ్ గ్యార మనీషా వెంకటేష్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా గృహ ప్రవేశంలో ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ జిల్లా నాయకులు గోళి పింగళ్ రెడ్డి, పొట్టోల శ్యామ్ గౌడ్ పాల్గొని ఇంటి దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుపేదలు ఆనందంగా ఉన్నారని ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమవుతుందని



అన్నారు. ఇందిరమ్మ ఇంటి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్నాబోయిన కిలందర్., వార్డ్ సభ్యులు , ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్డు లేకుంటే ప్రాణాలకు ముప్పే..!

## పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నా స్పందించని అధికారులు

**భువనగిరి, జూన్ 23 (జనంసాక్షి)**

భువనగిరి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ తక్కువగా ఉన్న రోడ్లపైనే ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలు ప్రజలను కలవరపెడుతున్న వేళ ఎన్‌హెచ్-163 జాతీయ రహదారి పక్కనే ఉన్న పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం నాలుగు పర్యాయాలు జాతీయ రహదారిని దాటి పాఠశాలకు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం వెంటాడుతోంది. ఒకవేళ ఇక్కడ ఏదైనా దుర్ఘటన చోటుచేసుకుంటే దాని ప్రభావం అనేక కుటుంబాలపై పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుటుంబానికి ఆధారమైన తల్లి లేదా తండ్రిని కోల్పోతే ఆ కుటుంబం మొత్తం కుప్పకూలిపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.










ఈ సమస్య పరిష్కారానికి పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి స్టాన్లీ గత కొన్నేళ్లుగా నిరంతర పోరాటం చేస్తున్నారు. అప్పటి ఎంపీగా ఉన్న సమయంలోనూ, అనంతరం కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుత ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ కలెక్టర్ హనుమంతు జెండగే తదితర ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా సమస్య తీవ్రతను వివరించారు. మాజీ కలెక్టర్ ప్రమీల సత్పతి కి ట్రాఫిక్ కానిస్టేబుల్ ని ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించి ఉదయం సాయంత్రం ట్రాఫిక్ కానిస్టేబుల్ ని ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా, "ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా"గా గుర్తింపు పొందిన పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం కావడంతో కేంద్ర మంత్రి గంగపురం కిషన్ రెడ్డికి ప్రత్యేకంగా మెమోరాండం అందజేశారు. కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కూడా అన్ని ఆధారాలు, లేఖలను జతచేస్తూ ఈ-మెయిల్ ద్వారా వినతి పంపించారు.

అయితే సంవత్సరం కాలం గడిచినా సంబంధిత శాఖల నుంచి ఎలాంటి చర్యలు కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోంది. కనీసం తాత్కాలికంగా మట్టి రోడ్డు అయినా ఏర్పాటు చేసి విద్యార్థులు, ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

**వేలాది మందికి ప్రయోజనం**

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం వరకు సర్వీస్ రోడ్డు నిర్మించి, ఆ మార్గంలో ఆర్టీసీ లోకల్ బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇదే మార్గంలో ఐటీఐ, ఫారెస్ట్ ఆఫీస్ పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వెంచర్స్, హోటల్స్ ఉండటంతో వేలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు.

ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించే కంటే, ముందస్తుగా చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించడమే నిజమైన పరిపాలన అని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# కార్మికుల సమస్యలపై సాచివేత ధోరణితో కాంగ్రెస్ ప్రభుత్వం

**- రెండున్నర సంవత్సరాలైనా పెరగని వేతనాలు**

**- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా**

భద్రాచలం జూన్ 24 (జనంసాక్షి)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 వేల మంది గ్రామ పంచాయతి కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సాచివేత ధోరణితో వ్యవహరిస్తుందని, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైనా రెండు రూపాయలు కూడా వేతనం పెరగలేదని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ.జె రమేష్ విమర్శించారు. బుధవారం గ్రామ పంచాయతి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ఎదుట రాష్ట్ర కమిటి పిలుపు మేరకు భద్రాచలం లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా శిబిరం వద్ద ఎ.జె.రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా కార్మికులను పర్మినెంట్ చేయడం, జీతం రూ.18 వేలకు పెంచడం హామీలన్నీ గాల్లోకి కలిసిపోయాయని విమర్శించారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. కొత్తగా ఆరు నెలల క్రితం గ్రామ పంచాయతీలలో పాలక వర్గాలు ఏర్పడిన నాటి నుంచి కొన్ని పంచాయతీలలో కాత్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతి కార్మికులను రెండవ పీఆర్సీ పరిధిలోకి తేవాలని, కనీస వేతనం పెరుగుతున్నా ధరలకనుగుణంగా రూ.26 వేల రూపాయలు పెంచాలని, ఇప్పటికైనా తన కార్మిక వ్యతిరేఖ పోకడలను, విధానాలను మార్చుకోవాలని లేని యెడల పోరాటలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో సీఐటీయు సీనియర్ నాయకులు ఎంబీ నర్సా రెడ్డి, నాగరాజు, గ్రామ పంచాయతి యూనియన్ నాయకులు రామకృష్ణ, భవాని, నాగరాజు, నరసింహారావు, వెంకటేష్, నరేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి చేయాలి

## కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం కార్పొరేషన్, జూన్- 24 ( జనం సాక్షి )**

జిల్లాలో రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా అంజనాపురంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణం, మౌళిక వసతులు, నిర్మాణ పనులు, యంత్రాల ఏర్పాట్లపై సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఎండల తీవ్రత వంటి సవాళ్లను తట్టుకుని నిలబడగలిగే పంటల్లో ఆయిల్ పామ్ ముఖ్యమైందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ తోటలలో ప్రారంభ మూడు సంవత్సరాల వరకు మిర్చి, మొక్కజొన్న, వరి వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ జిల్లాలో వ్యవసాయ ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి నాంది పలుకుతుందని, జిల్లా రైతాంగానికి ఉపాధి, ఆదాయ వృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా జిల్లా పరిపాలన తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కొణిజర్ల తహసీల్దార్ అరుణ, ప్రాజెక్ట్ డీజీఎం, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా సవరణపై బీఎల్ఓ, బీఎల్ఏ ప్రత్యేక సమన్వయ సమావేశం

**● అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి..**

**● ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేందుకు సమన్వయంతో పనిచేయాలి ● సంజీవ్ కుమార్, దేవరకొండ తహశీల్దార్**

**దేవరకొండ, జూన్ 24(జనంసాక్షి)**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థ వంతంగా నిర్వహించేందుకు బూత్ లెవల్ అధికారులు ,బూత్ లెవల్ ఏజెంట్లు లతో పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పాల్గొన్న ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు.?భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు,మరియు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని తహశీల్దార్ ఈ సంజీవ్ కుమార్ పిలుపునిచ్చారు.?ఈ సమావేశంలో అధికారులు ముఖ్యమైన మార్గదర్శకాలను జారీ చేశారు.?కొత్త ఓటర్ల నమోదు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ (ముఖ్యంగా యువతను) ఓటర్లుగా నమోదు చేసేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు.?తప్పుల సవరణ: ఓటరు కార్డులలో పేర్లు, వయస్సు, ఫొటోలు, అడ్రస్ తప్పుగా ఉంటే ఫారం-8 ద్వారా సరిచేయాలని సూచించారు. జాబితా ప్రక్షాళన: మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు మరియు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లయితే, నిబంధనల ప్రకారం ఫారం-7 ద్వారా వాటిని ఓటరు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. సమన్వయం: రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని అర్హులైన ఓటర్ల వివరాలను బీఎల్ఓల దృష్టికి తీసుకువచ్చి, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు బీఎల్ఓలను ఆదేశించారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.?ఈ సమావేశంలో ఎన్నికల సిబంది మరియు , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సూపర్ వైజర్లు మరియు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నాయి

## బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి



**నేరేడుచర్ల (జనంసాక్షి) :** కాంగ్రెస్ బిజెపి ఆడుతున్న కుట్టిన రాజకీయాలు ప్రజలందరికీ అర్థమయి పోయిందని, మెట్రో రైలుపై ఆ పార్టీల వైఖరిని ప్రజలందరూ అర్థం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణకి ఆదాయం వచ్చే వనరులన్నిటిని కూడా సీఎం రేవంత్ రెడ్డి దానధర్మాలు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లెక్కలు అర్థం కావడం లేదు గతం కంటే ఎక్కువ కొనుగోలు చేసాము వద్దు అంటూ భజన చేసుకుంటున్నాడు.కానీ గతంతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోలు శాతం తగ్గిందని కేవలం 59 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని,ఇంకా రైతుల వద్ద కుప్పలు కుప్పలుగా ధాన్యం ఉందని ప్రస్తుతం ఆ దాన్యాన్ని కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆరోపించారు. యాప్ లో లేని యూరియా షాపులో ఎలా ఉంటుందని ప్రశ్నించారు, యదేచ్ఛగా యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం జరుగుతుందని అన్నారు.సుమారు యూరియా బస్తా 300 నుంచి 400 రూపాయల వరకు బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.గతంలో సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు రైతులు ధాన్యం కొనమంటూ ఎన్నడు రోడ్లెక్కలేదని అన్నారు. ధర్నా చేసిన దాఖలాలు లేవు అన్నారు.కాంగ్రెస్ వచ్చాక రైతుల జీవితాలు అన్నీ కూడా ఆగమైపోయినయ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె .ఎల్.యన్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సురేష్ బాబు,మాజీ ఎంపీపీ చెన్న బోయిన సైదులు,మాజీ మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబు మాజీ డిసిసిబి డైరెక్టర్, మున్సిపల్ కౌన్సిలర్, అప్పిరెడ్డి, హుజూర్ నగర్ మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి,వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్లు కడియం వెంకట్ రెడ్డి,నాగండ్ల శ్రీధర్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరావు,మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు గుర్రం మార్కండేయ. వింజమూరు రాములు, చిట్యాల శ్రీను, పోకబత్తినీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

## మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్



**కల్లూరు జూన్24(జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలోనీ విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన పథకాన్ని పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు మున్సిపల్ చైర్మన్ దారాత్ మోహన్ నాయక్ సూచించారు.

కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ , కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగాపాఠశాలలో విద్యార్థు లకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అందిస్తున్న పోషకాహార విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చైర్మన్ మోహన్ నాయక్ తెలిపారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చైర్మన్ మోహన్ నాయక్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి, విద్యార్థులతో కలిసి కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. ఆహారం రుచి, నాణ్యత పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో వండాలని, మెనూ ప్రకారం అన్ని పోషకాలు ఉన్న ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, కాంగ్రెస్ నాయకులు శీలం కృష్ణారెడ్డి యాస శ్రీకాంత్ ధరావత్ రవికుమార్,ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యవారిగూడెం సొసైటీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన అనుమోలు.సాంబశివరావు



**ఎర్రుపాలెం, జూన్ 24 (జనంసాక్షి):** పి.ఎ. సి.ఎస్ అయ్యవారిగూడెం సొసైటీ చైర్పర్సన్ ఇంచార్జి బాధ్యతలు బుధవారం అనుమోలు.సాంబశివరావు చేపట్టారు. పి.ఎ. సి.ఎస్ అయ్యవారి గూడెం సంఘము నందు ఇటీవల అమెరికా నుండి వచ్చిన అనుమోలు సాంబశివరావు స్వీకరించారు.ఇంచార్జిగా ఉపా అధ్యక్షులు శ్రీమతి గొల్లపూడి జయమ్మ నుండి బాధ్యతలు తీసుకోవటం జరిగినది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తమకు మళ్ళీ అవకాశం వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ సొసైటీ అభివృద్ధికి పాటుపడతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీహరి నారాయణ, మండ్రు మోక్షం, రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన కవిత డిగ్రీ కళాశాల విద్యార్థులు



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 24 (జనంసాక్షి)** స్థానిక ఉపేంద్రయ్య నగర్ ,గట్టయ్య సెంటర్ లోని కవిత డిగ్రీ కాలేజి నుండి నేడు ప్రకటించిన కాకతీయ విశ్వవిద్యాలయ ఆరవ సెమిస్టర్ ఫలితాలలో కవిత డిగ్రీ కాలేజి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మా విద్యార్థులు సాధించిన ఫలితాలు...బిఎస్సీ విభాగం నుండి సిహేచ్ హేమలత (ఎస్జీసిఎ 9.04), అర్ అక్షిత (9.02),ఎస్కె కరిష్మా (8.96),ఎస్ లిఖిత (8.91), కె రమ్య (8.80), డి భవాని (8.78), బి.కాంమ్ విభాగం నుండి ఎమ్ డి అమినా (8.35),సిహేచ్ ఫిబి జ్యోతిర్మయి (8.22), ఎస్కె రియాజ్ (8.20) మరియు బిఏ విభాగం నుండి జీ శ్రావణి (7.80),కె ప్రసన్న (7.70), వీరితో పాటుగా సుమారు 300 కి పైగా 'ఎ' గ్రేడ్ లు వివిధ సబ్జెక్టులలో విద్యార్థులు సాదించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని,విద్యార్థులను కవిత డిగ్రీ కాలేజ్ సెక్రటరీ ఉ కరస్పాండెంట్ పారుపల్లి ఉషాకిరణ్ కుమార్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహేచ్.రాధాకృష్ణమూర్తి ,పి.జి కాలేజి ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్ పి.రోజారాణి మరియు అధ్యాపకులు అభినందించారు.

# కల్లూరు మండల నూతన విద్యాశాఖ అధికారినిగా పొదిలి పద్మ



**కల్లూరు జూన్ 24(జనం సాక్షి)** కల్లూరు మండల విద్యాశాఖ ఇంచార్జి అధికారినిగా పొదిలి పద్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈఓ గా బాధ్యతలు నిర్వహించిన పత్తిపాటి నివేదిత ఎంఈఓ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈ నేపధ్యంలో కల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న పొదిలి పద్మను కల్లూరు మండలం ఇన్చార్జి ఎం ఈ ఓ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె ఎంఆర్సి కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన పొదిలి పద్మను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

# బోర్ మోటార్ల ఎలక్ట్రికల్ సర్వీస్ వైర్ల చోరీ



**పెనుబల్లి జూన్ 24( జనం సాక్షి)** పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామ పంచాయతీకి నీటిని సరఫరా చేసే బోరు రుకు సంబంధించిన సుమారు 12 వేల రూపాయల విలువ చేసే 80 మీటర్ల ఎలక్ట్రికల్ సర్వీస్ వైరు మంగళవారం రాత్రిగుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి దొంగిలించారు.ఇదే గ్రామానికి చెందిన నాగుల రాంబాబు పామాయిల్ తోటలోని బోరుకు సంబంధించిన సర్వీస్ వైర్ ని కూడా దొంగిలించారు.గ్రామ పంచాయతీకి త్రాగునీటిని అందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రాతోని చెరువు సమీపంలో నాలుగు బోర్లను ఏర్పాటు చేశారు. ఈ బోర్ల ద్వారా గ్రామ పంచాయతీకి నీటి సరఫరా జరుగుతుంది. పెనుపల్లి గ్రామంలోని వ్యవసాయ, మామిడి, పామ్ ఆయిల్ తోటల్లో బోర్ల మోటార్లు, సర్వీస్ వైర్ల చోరీ సంఘటనలు తరచు జరుగుతూనే ఉన్నాయి. బుధవారం గ్రామ సర్పంచ్ బాణోత్ పాపలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ మోటార్ ఎలక్ట్రికల్ సర్వీస్ వైర్ చోరీపై విఎం బంజర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి రూ.1.45 లక్షలు



**మణుగూరు, జూన్ 24 (జనంసాక్షి):** ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. బిటీపీఎస్ సీఈ ఆధ్వర్యంలో బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ. 1.45 లక్షల చెక్కు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఇలాంటి సిఎస్ఆర్ నిధులు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు.సమాజాభివృద్ధిలో భాగంగా మరిన్ని సంస్థలు కూడా విద్యా రంగ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సి పి ఓ సంజీవరావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఎస్ఐ అజ్మీర రమేష్

**కొండమల్లేపల్లి, జూన్ 24 (జనంసాక్షి):**




మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ అజ్మీర రమేష్ మొహర్రం నిర్వాహకులకు సూచించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గుమ్మడవల్లి గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా ఎంతో అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొహర్రం పండుగ త్యాగం, స్ఫూర్తికి ప్రతీక అని విశ్వాసం, నమ్మకం కోసం అత్యంత గొప్ప మానవతాహృదయం కలిగిన ముహమ్మద్ ప్రవక్త గారి మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే మొహర్రం అని అన్నారు. మానవ జాతిలో త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే మొహర్రం వేడుకలకు నిజమైన అర్థమని అన్నారు. కర్బలా మైదానంలో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రపంచం మొత్తం కన్నీళ్ళతో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ ను తలుచుకుంటారని అన్నారు. అలాంటి నీతి నిజాయితీ త్యాగానికి మారుపేరైన మొహర్రం సందర్భంగా గుమ్మడవల్లి గ్రామ ప్రజలందరూ నిజాయితీగా ఉండాలని అన్నారు.ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించి ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువకులందరూ సమన్వయం పాటిస్తూ అగ్నిగుండం చుట్టూ తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు.

## జగన్నాథపురం లో అమ్మ మాట అంగన్వాడి బాట

ములకలపల్లి : జూన్ 25 జనంసాక్షి :

నరసాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రాల్లో అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాసం, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమాలలో సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ భవాని, ఉప సర్పంచ్ జలగం మాధవి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నర్సాపురం స్కూల్ హెచ్ యం, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మడవల్లి గ్రామంలో నేడు పెద్దశరిగత్



**కొండమల్లేపల్లి, జూన్ 24 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో కులమతాలకు అతీతంగ మొహర్రం వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారు. మొహర్రం వేడుకలలో భాగంగా గురువారం రాత్రి పెద్ద శరిగత్ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముజావర్లు మాట్లాడుతూ తరాలు మారినా తాతలు మారినా వన్నె తరగని రాజసంతో సన్నాయి ఆటపాటలు డబ్బు చప్పుల్లతో భక్తులు అత్యంత ఇష్టంగా భావించే లాల్ సవార్ ను చుసి తరించాలని నల్లగొండ, గుంటూరు, హైదరాబాద్ తోపాటు మహబూబ్ నగర్ జిల్లాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో ప్రతి సంవత్సరం వస్తారని అన్నారు. గురువారం అశురా పదోరోజు సాయంత్రం నుండి తెల్లవారే వరకు ప్రజలందరూ కులమతాలకతీతంగా పీర్ల దగ్గరికి వెళ్లి మటికీలు, దట్టీలు, టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం నిప్పుల గుండం అలావ చుట్టూ భక్తిశ్రద్ధలతో ఆటలు ఆడుతారు. రాత్రంతా యువకులు మహిళలు, యువతులు చావిడి అలావ చుట్టూ సంబరాలతో ఆటలాడుకుంటారు. గత 100 సంవత్సరాల నుండి భక్తుల కోరుకున్న కోరికలను నెరవేర్చిన లాల్ సవార్ ను ప్రజలు ఎంతో అమితంగా ఇష్టపడుతారు. ఇంత అభివృద్ధి చెందిన టెక్నాలజీ రోజులలో కూడా లాల్ సవార్ ను చూడటానికి ఇష్టపడేవారు వేల సంఖ్యల్లో ఉన్నారన్నారు. పెద్దలు మహిళలు యువకులు చిన్నారులు ఆడపిల్లలు కూతుర్లు అల్లుళ్ళతో గ్రామం మొత్తం అహ్లాదకరంగా ఉంటుందన్నారు. మన పూర్వీకులు కులమతాలకు అతీతంగా ఎంతో ముందు చూపుతో లాల్ సవార్ ప్రతిష్టను ఇప్పటి తరానికి అందించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మన గుమ్మడవల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు పోలీసుల పటిష్ట పర్యవేక్షణలో నిర్వహిస్తారన్నారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొహర్రం వేడుకలు విజయవంతం చేయాలని నిర్వాహకులు సూచించారు.

## గుండె జబ్బులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దు

### గుండె జబ్బులకు వయసుతో సంబంధం లేదు

### మందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

### సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణీత్ పోలమూరి

**సూర్యాపేట (జనంసాక్షి):**




గుండె జబ్బులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణీత్ పోలమూరి అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన శైలి కారణంగా పలు వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ హెల్త్ రిస్క్ గురించి తెలుసుకోవాలన్నారు.గుండె జబ్బులకు వయసుతో సంబంధం లేదని అన్నారు.ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గుండెకి హాని జరుగుతుందన్నారు.గుండె ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి పెట్టాలని,ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు.ఛాతిలో నొప్పి లేదా ఏదో బరువుగా ఉండటం, కొద్దిపాటి శ్రమకే లేదా విశ్రాంతి సమయంలో శ్వాస ఆడకపోవడం,స్పృహ కోల్పోవడం, అలసటగా అనిపించడం,తరచూ తల తిరగడం, ఎడమ చేతి, మెడ, దవడ,వీపులో నొప్పి వంటి లక్షణాలు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యున్ని సంప్రదించాలని అన్నారు.రోజువారీ వ్యాయామం, యోగా, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు.ఉప్పు, అధికంగా నూనె, జంక్ ఫుడ్స్, నిల్వ ఉండే పదార్థాలను తినడం తగ్గించాలన్నారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకోవడంతో పాటు వాటిని అదుపులో ఉంచుకోవాలన్నారు.



### తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం

## జయప్రదం చేయండి

### ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

**కల్లూరుజూన్ 24(జనంసాక్షి)**

ఈనెల 29న హైదరాబాదులో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళన సభను జయప్రదం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంగం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ఉద్యమకారులకు పిలుపు నిచ్చారు. బుధవారం కల్లూరు మండలం లో ఉద్యమకారుల సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఇంచార్జ్ వలసాల మణికిషన్, పడిగల రమేష్, మత్తి గోపాల్, దుర్గారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ దుష్పరిణామాల పై అవగాహన సదస్సు

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**

విద్యార్థులు క్షణికానందం కోసం వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును, జీవితాలను నాశనం చేసుకోవద్దని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలు మరియు చట్టపర మైన చర్యలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు నేరేడుచర్ల ఎస్ఐ తెలిపారు.ఈ కార్యక్రమానికి కోదాడ డీఎస్పీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాల అలవాటు వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారువిద్యార్థులు చదువుపై దృష్టి సారించి సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణతో పాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



## అంగన్వాడి టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు వేయవద్దని సిఐటియు డిమాండ్

**మేళ్లచెరువు జనంసాక్షి**

ఈరోజు మేళ్లచెరువు మండల కేంద్రంలో తాసిల్దార్ సుధారాణి గారికి అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు వేయవద్దని ధర్నా అనంతరం తాసిల్దార్ సుధారాణికి మెమోరాండం ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వట్టేపు సైదులు.మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడి టీచర్లకు బూత్ లెవెల్ సర్ డ్యూటీలు కేటాయించటం వల్ల గర్భిణీల సౌరక్షణ పౌష్టికాహారం వంటి ప్రధాన బాధ్యతలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. పిల్లలకు సేవలు చేయాల్సిన సమయంలో సర్వేలకు వెళ్లడం వల్ల గర్భిణీలకు అత్యవసర సేవలు చాలా ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు తీవ్రమైన మానసిక ఒత్తిడికి ఎదుర్కొంటున్నారని తెలిపారు .ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు స్కూలుకు పోతున్న సమయంలో అంగన్వాడీ సెంటర్లలో పిల్లలు లేకపోతే ప్రభుత్వం సెంటర్లని రద్దు చేస్తామని పక్క చెబుతుందని అన్నారు. అంగన్వాడి టీచర్లు సరి డ్యూటీలకు వెళ్లే సమయంలో ప్రభుత్వ పాఠశాలలో వాళ్లు అంగన్వాడి స్కూల్ పిల్లలని స్కూలుకు తీసుకుపోతున్నారని అన్నారు .దీనివల్ల సెంటర్లలో పిల్లలు లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం సెంటర్లో రద్దు చేస్తుందని గుర్తు చేశారు అయినప్పటికీ ఎంతో కష్టపడి బిఎల్ఓ డ్యూటీలు చేస్తున్న అంగన్వాడీ టీచర్లపై స్థానిక నాయకులు కొంతమంది అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం ఒంటి వంటవరకు సర్వేలు చేస్తున్నారని తెలిపారు .స్కూల్ టైం లో సర్వే కి వెళ్లడం వల్ల గ్రామాల్లో ప్రజలు అంగన్వాడి టీచర్లు ఉండటం లేదని వారంటున్నారు.




దీని దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ టీచర్లకు అదనపుడ్యూటీలు చేస్తే అదనపు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఇప్పటికైనా అంగన్వాడి టీచర్లపై వేధింపులు అరికట్టాలని వారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు నాగేశ్వరమ్మ,వెంకట నరసమ్మ, శ్రీలత, ప్రియాంక ,కుమారి, లక్ష్మి, శ్రీదేవి, తదిరులు పాల్గొన్నారు